

నేషనల్ అవార్డులకు ఉపాధ్యాయుల నుంచి నామినేషన్ల స్వీకరణ

కరీంనగర్ టౌన్, జూన్ 29: డైరెక్టర్ ఆఫ్ స్కూల్‌ఎడ్యుకేషన్ ద్వారా నిర్వహించే నేషనల్ అవార్డు-2024 టీచర్స్ ఇనిసియేషన్ ఆఫ్ సెలక్షన్ ప్రాసెస్‌కు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ కోసం వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15లోగా నామినేషన్లను పోర్టల్‌లో నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశ్నార్థకంగా సన్నాల సాగు



- ఏయే రకాలకు బోనస్ ఇస్తారో స్పష్టం చేయని ప్రభుత్వం
- సందిగ్ధంలో అన్నదాతలు
- దొడ్డు రకాల వైపు మొగ్గు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు ధాన్యం సేకరణ సమయంలో క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్‌ను ప్రకటించింది. రేషన్ బియ్యంగా కూడా సన్న రకాలనే సరఫరా చేస్తామని ప్రకటించడంతో ఈ వానా కాలం జిల్లా వ్యాప్తంగా సన్న రకాల సాగు పెరుగుతుందని ఆశించారు. సాధారణంగా 10 నుంచి 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే రైతులు గృహ అవసరాల కోసం సన్న వరి రకాలను సాగు చేస్తారు. ఈసారి సాగు విస్తీర్ణం 60 శాతం వరకు పెరిగే అవకాశముందని అంచనా వేశారు. బోనస్‌ను ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత ఏయే రకాలకు ఈ బోనస్‌ను వర్తింపజేస్తామో తెలియజేస్తామని చెప్పింది. వానా కాలం మొదలై రెండు కార్తెలు అంటే నెలరోజులు పూర్తికావస్తున్నా ఏయే రకాల సన్నాలకు బోనస్ ఇస్తారో ప్రకటించకపోవడంతో రైతులు నార్లు పోసుకోలేక పోయారు. అక్కడక్కడ రైతులు సన్న వరి రకాలకు నార్లు పోసుకున్నా ఆ రకాలకు బోనస్ రాకున్నా గృహావసరాలకు వినియోగించుకోవచ్చని అనుకున్న వారే నార్లు పోశారు. ఇప్పుడు ప్రభుత్వం ఏయే రకాలకు బోనస్ వర్తింపజేస్తుందో ప్రకటించినా నార్లు పోసి పెరిగే వరకు నెలరోజులపైన అవుతుంది. అప్పుడు నాట్లు ఆలస్యమై దిగుబడి తగ్గే ప్రమాదముంది. సన్న వరి రకాలు తక్కువ దిగుబడిని ఇస్తాయి. చీడ,పీడలు కూడా ఎక్కువగా ఆశించడంతో క్రిమిసంహారక మందుల పెట్టుబడులు పెరుగుతాయి. ఆ కారణంగానే రైతులు సన్నరకాల సాగుకు ముందుకు రారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ ఇచ్చే రకాలను ప్రకటించినా ఈ సీజన్‌కు పెద్దగా సన్నరకాల సాగు పెరుగక పోవచ్చని భావిస్తున్నారు.

ఎక్కువ సమయం.. తక్కువ దిగుబడి

సన్న వరి రకాలు సాగు చేస్తే దొడ్డు రకానికంటే ఎక్కువ కాలం నీరు అందించాల్సిన అవసరముండడం, చీడపీడలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నందు వల్ల క్రిమిసంహారక మందుల కోసం ఎకరాకు అదనంగా ఐదు వేల రూపాయల మేరకు పెట్టుబడులు పెరుగుతుంది. దొడ్డురకాలతో పోలిస్తే ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల మేరకు దిగుబడి తక్కువ వచ్చే అవకాశముంది. దీంతో రైతులు సన్న రకాల సాగుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఒక ఎకరంలో పండే ధాన్యంపై 10 నుంచి 12వేల రూపాయలు అదనంగా వచ్చే అవకాశముండడంతో రైతులు ముందుకు వస్తారని భావించారు.

● హుజూరాబాద్ డివిజన్‌లో ఆశాజనకంగా..

జిల్లాలో ప్రధానంగా హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్‌లో విత్తన వరి రకాలను ఆయా కంపెనీల ఒప్పందాలతో సాగు చేస్తారు. ప్రతియేటా 50 వేల ఎకరాలపైచిలుకు విస్తీర్ణంలో విత్తన పంట సాగవుతుంది. వర్షాకాలం విత్తన పంటను సాగు చేయరు. ఈ కారణంగా ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఆ డివిజన్ రైతులందరూ సహజంగానే సన్న వరి రకాల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దాదాపుగా రైతులందరూ సన్న వరి రకాల నార్లు పోసుకున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఇప్పటి వరకు నాట్లు ప్రారంభం కాని పరిస్థితి ఎదురైంది. గడిచిన ఐదురోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రాబోయే రోజుల్లో కూడా వర్షాలు కురుస్తాయనే వాతావరణ ప్రకటనలు వెలువడుతుండడంతో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం తాము సూచించిన సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు ఆ రకాలు ఏవో అధికారికంగా పేర్కొనలేదు. ప్రస్తుతం రైతులు నార్లు పోసుకున్న రకాలు బోనస్ రకాలవునో కాదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆ డివిజన్‌లో రైతులు బోనస్ రాకున్నా సొంత అవసరాలకు, ప్రైవేట్ వ్యాపారులకు సన్నరకాలను విక్రయించుకోవచ్చనే ధీమాతో ముందే నార్లు పోసుకున్నారు. ప్రధానంగా కరీంనగర్ డివిజన్‌లో ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్న కారణంగా సన్న రకాల నార్లు పోసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు నార్లు పోసినా పంట కాలం పెరిగి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నందున రైతులు ఈ డివిజన్‌లో దొడ్డ వరి రకాలనే సాగు చేసే అవకాశమున్నది. దీంతో జిల్లాలో 2,75,000 ఎకరాలలో వరి సాగు చేసినా సన్న రకాల సాగు 20శాతానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశాలున్నాయి.

● గతంలో ఇబ్బందులు

జిల్లాలో వానా కాలంలో ప్రతిసారి సుమారు 2,75,000 ఎకరాల నుంచి 3,00,000 ఎకరాల వరకు వరి సాగు అవుతుంది. యాసంగిలో రెండున్నర లక్షల ఎకరాలకు తగ్గకుండా వరి సాగు చేస్తారు. యాసంగిలో నీటి కొరత, ఎండ తీవ్రత కారణంగా ధాన్యం మరాడిస్తే నూకలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నందున రైతులు కేవలం దొడ్డు రకాలను మాత్రమే సాగు చేస్తారు. వర్షాకాలం సాగులో సన్నరకాలను సాగు చేసినా కేవలం 20 శాతానికి మించిన సాగు జరుగడం లేదు. జిల్లావ్యాప్తంగా కేవలం 5,500 ఎకరాల నుంచి 6,500 ఎకరాల వరకు మరీ ఎక్కువగా అయితే 10వేల ఎకరాలకు మించి సన్న వరి సాగు జరుగడం లేదు. మూడేళ్ల క్రితం ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సన్న వరి రకాల సాగును ప్రోత్సహించినా కొనుగోలు సమయంలో సివిల్ సప్లయిస్ సంస్థ తిరకాసు పెట్టడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కు ధరకే వ్యాపారులకు అమ్ముకోవలసి వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం చెప్పినా రైతులు దొడ్డు వరి సాగునే చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సన్నరకం వరి సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రేషన్ బియ్యంగా సన్న రకాలనే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో 25 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు సన్నబియ్యం డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్ ఉన్న కారణంగా రైతులు సాగుకు ముందుకు వస్తారని ప్రభుత్వం ఆశించింది.

రూ.500 బోనస్ ఇవ్వకుంటే నష్టపోతాము

- రామిడి మల్లారెడ్డి, రైతు, తిమ్మాపూర్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సన్న రకాలు ఎక్కువగా పెట్టాలని ఆదేశించడంతో చాలా మంది రైతులు సన్నాలను పండించారు. ప్రభుత్వం వాటిని కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పింది. కాని తాము చెప్పిన రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఒకవేళ ప్రభుత్వం బోనస్ ఇవ్వకుంటే ఆ ధాన్యాన్ని మార్కెట్‌లో తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. దీని కారణంగానే రైతులు సన్న రకం వరిసాగుకు ఎక్కువగా ముందుకు రావడం లేదు.

దొడ్డు రకాలతో అధిక దిగుబడి..


- కాంతాల జగన్‌రెడ్డి, రైతు, మల్కాపూర్, కొత్తపల్లి మండలం

దొడ్డు వరి సాగు కాలపరిమితి నాలుగు నెలలు.. పంట కాలంలో రోగాలు రావు. క్రిమిసంహారక మందులు స్ప్రే చేయాల్సిన అవసరం ఉండదు. సన్న రకాల కంటే అధిక దిగుబడి వస్తుంది. సన్న వరి రకాల పంట కాలం ఐదు నెలలు.. దోమపోటు వంటి రోగాలు ఎక్కువగా వస్తాయి. మందులు స్ప్రే చేయాలి. దొడ్డు వడ్ల కంటే ఈ రకం ధాన్యానికి దిగుబడి తక్కువ. మార్కెట్లో సన్న వడ్లుకొనేవారు తక్కువ. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దొడ్డు వరిసాగుకే మొగ్గుచూపిస్తున్నాము..

బోనస్ ఏ రకం వడ్లకు ఇస్తారో చెప్పలేదు..

- మల్లయ్య, రైతు, ఉల్లంపల్లి, చిగురుమామిడి మండలం.

ఎలాంటి రకం విత్తనాలకు బోనస్ ఇస్తారో చెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను సందిగ్ధంలో పడేసింది. మాకు నచ్చిన సన్నాలను సాగు చేస్తే ప్రభుత్వం 500 బోనస్ ఇస్తుందో లేదో తెలియడం లేదు. ఇలాంటి సన్న రకాలు వేయాలని ప్రభుత్వం చెప్తే రైతులు వాటినే సాగు చేసే వారు.



బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయకుంటే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 29: హాస్పిటల్స్‌లో బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేయకుండా మున్సిపల్ వ్యర్థాలతో కలిపి చెత్త వాహనంలో వేస్తే జరిమానాతోపాటు లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. శనివారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఆసుపత్రులు, క్లినికల్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బందికి బయో మెడికల్ వ్యర్థాల నిర్వీర్యం నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల నుంచి హైపటైటీస్ బి, హెచ్‌ఐవీ, టీబీ తదితర వ్యాధులకు సంబంధించిన హానికరమైన వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపి వేయడంతో పాటుగా సూదలు, బ్లేడ్స్, రక్తపు సంచులతో పారిశుధ్య కార్మికులు రోగాలబారిన పడే ప్రమాదముందని అన్నారు. ఆసుపత్రిలోని వ్యర్థాలు, కాటన్, డ్రెస్ మెటీరియల్, రక్తపు సంచులు, సిరంజీలు, యూరిన్ బ్యాగులు, గాజు ముక్కలుగా వేరు చేసి పసుపు, ఎరుపు, నీలం రంగు బ్యాగులలో నిలువ చేయాలన్నారు. ప్రభుత్వ ఆమోదిత బయో వ్యర్థాల నిర్మూలన కేంద్రం వారితో ఒప్పందం చేసుకుని వాటిని సరైన పద్ధతిలో నిర్వీర్యం చేయాలని సూచించారు. నగరంలోని ఆసుపత్రుల నిర్వాహకులు నిర్మూలన కేంద్రంతో అనుసంధానం కావాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ స్వరూపరాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఐఎంఏ బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

కరీంనగర్ టౌన్, జూన్ 29: ప్రొఫెసర్ పీసీ మహలనోబీస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంక దినోత్సవాన్ని కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పీసీ మహలనోబీస్ అవలంబించిన వివిధ పద్ధతులను నేటికీ వ్యవసాయ రంగంలో దిగుబడిని, పారిశ్రామిక రంగంలో ఉత్పత్తులను అంచనా వేసేందుకు ఉపయోగిస్తున్నారని అన్నారు. రెండో పంచవర్ష ప్రణాళికలో దేశీయ పరిశ్రముల నెలకొల్పడంలో ఎన్నో మార్గదర్శకాలను ఆయన సూచించారని అన్నారు. మండల సహాయక గణాంక అధికారులందరూ ప్రాథమిక సమాచారాన్ని కచ్చితత్వం, వాస్తవికతకు దగ్గరగా సేకరించాలని సూచించారు. ఈ సమాచారం ముందస్తు ప్రణాళికలు చేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం జిల్లా గణాంక దర్శినిని కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీవో డి కొమురయ్య, గణాంక అధికారి వి రాందత్తారెడ్డి, ఉప గణాంక అధికారులు వి శ్రీనివాస్, డి జ్యోతి, యు తిరుపతి పాల్గొన్నారు.

2న జడ్పీ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, జూన్ 29: జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జూలై 2న ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 29: ఉమ్మడి జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3 వరకు www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు 18 జూలై నుంచి 18 ఏప్రిల్ 2025 వరకు నిర్వహిస్తామని తెలిపారు. వంద మందిని జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ద్వారా ఎంపిక చేస్తార ని, మరో 50 మంది అభ్యర్థులను ఇంతకు ముందు సివిల్ సర్వీ సెస్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా తీసుకుంటారని తెలిపారు. సివిల్స్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన వారు జూలై 3లోగా టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో దరఖాస్తును సమర్పించాలని సూచించారు. ఈ శిక్షణ హైదరాబాదులో ఉంటుందని తెలిపారు. వివరాలకు 0878-2268686 నంబరును సంప్రదించాలని సూచించారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

కరీంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా కలెక్టర్లు పర్యవేక్షించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఆయన కలెక్టర్లతో ధరణి పెండింగ్, ఇతర దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో జూన్ 15 నుంచి 28 వరకు పరిష్కరించిన దరఖాస్తులతో పాటు పరిష్కరించాల్సిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో వారంలోగా పెండింగ్ దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని, క్లియర్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఎస్‌ఆర్ లిమిట్, మిస్సింగ్ సర్వే నంబర్లు, సక్సేషన్, మ్యూటేషన్, వివిధ సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు సూచనలు చేశారు. దరఖాస్తులపై చర్యలు తీసుకోవడంతో ఎదురయ్యే సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారిస్తామని, సీసీఎల్‌ఏ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించి వారంలోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఒక్క దరఖాస్తు కూడా తహసీల్దార్ లాగిన్లో పెండింగ్ ఉండకూడదు: కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తహసీల్దార్ లాగిన్లో ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ ఉండకూడదని అన్నారు. ప్రతి తహసీల్దార్ రోజుకు 200 దరఖాస్తులపై చర్యలు తీసుకొని కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. ప్రతిరోజు పెండింగ్ దరఖాస్తులను గురించిన వివరాలను తెలుసుకుంటానని, తహసీల్దార్ లాగిన్ నుంచి పై అధికారులకు పంపించే ముందు దానికి జతపరచాల్సిన ధ్రువీకరణలు, రిమార్కులను సరిచూసుకోవాలన్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉంటే మరింత సమయాన్ని కేటాయించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి



తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గణేశ్‌నగర్, జూన్ 29: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం ఆపాలని, సింగరేణి సంస్థకే నేరుగా బ్లాక్‌లను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలన్నారు. వేలం ద్వారా కేంద్రం ప్రైవేట్ సంస్థలకు అవకాశం ఇస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు 200 బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే నోరు మెదపక పోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుందరెడ్డి, గుడి కందుల సత్యం, జి భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ , ఎడ్ల రమేష్, నరేష్, పూజ, నాయకులు తిప్పారపు సురేష్, జి తిరుపతినాయక్, రాయికంటి శ్రీనివాస్, పున్నం రవి, జి కనకరాజు, కండే రాజు, కనకేష్ ,రోహిత్, వినయ్, సాయి, ఇసాక్, రాకేష్, రితీష్ పాల్గొన్నారు.





అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

కొండగట్టులో జనసేనాని

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు, వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయంలో పలు శాఖల అధికారులతో పాటు నాయకులు పవన్‌తో సెల్ఫీలు దిగారు. - మల్యాల





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్



జనసేనానికి తలపాగా చుడుతున్న అర్చకుడు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 29: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ఠ బహుళ అష్టమి తోడు కావడంతో లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆ లయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటు కున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశా రు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మం త్రోచ్చారణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు ని ర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీని యర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు సింగారం గుట్టపై అస్థిపంజరం

- రెండు నెలల క్రితం చనిపోయినట్లు నిర్ధారణ

- మగ వ్యక్తి మృతదేహంగా గుర్తింపు



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, వైద్యులు

పెద్దపల్లి రూరల్, జూన్ 29: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయితి పరిధి గట్టుసింగారం గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. గ్రామానికి చెందిన మేకల కాపరులు మేకలను గట్టుసింగారం గుట్టపైకి మేపడానికి తీసుకెళ్లడంతో గుట్టపైన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరం కనిపించింది. దీంతో సబ్బితం గ్రామపంచాయతీ కార్యదర్శికి రవికి సమాచారం అందించగా కార్యదర్శి బసంత్ నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదు చేశారు. దీంతో బసంత్ నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, వైద్యులు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పరిశీలించిన వైద్యులు సుమారు 25 నుండి 40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి ఆస్థిపంజరం అని , అతను చనిపోయి సుమారు రెండు నెలలు సమయం అయిందని పేర్కొన్నారు. సంఘటనపై అక్కడే పంచానామ నిర్వహించి , కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, జూన్ 29: తంగళ్లపల్లి మండ లం పద్మనగర్ గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్‌రెడ్డి (29) అనే యువకుడు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కొట్టాల లచ్చిరెడ్డి, ప్రమీల దంపతుల రెండో కుమారుడు కొట్టాల గోవర్ధన్‌రెడ్డి శుక్ర వారం రాత్రి రెండో అంతస్తులో ఉన్న బెడ్ రూమ్‌లో నిద్రించడానికి వెళ్లాడు. శనివారం ఉదయం 11 గంటలైనా నిద్రలేవకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా బెడ్ పైనుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోవర్ధన్ (ఫైల్)

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 29: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురు వాహనదా రులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీల లో పట్టుబడిన 28 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరో వ్యక్తికి ఏడు రోజులు, నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 13,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 36 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

10న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై 29: టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాల యంలో 8వ విడత జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను జూలై 10న ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తు న్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. పరీక్షలను పారద ర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని తెలిపారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టీఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరపున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడీ విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.


ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బోకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహుకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్లు వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.

మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?

నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్స్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!



సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్'(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకో వాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

'ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు'

కరీంనగర్ క్రైం, జూన్ 29: ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. పోలీస్ కమీషనరేట్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్స్‌గా పనిచేస్తూ పదవీకాలం ముగిసిన నలుగురు ఏఎస్సైలు బాపురెడ్డి(స్పెషల్ బ్రాంచ్), కాశెట్టి కిషన్, పి.విజేందర్ (ఏఆర్), ఎన్ లింబా, బి బాల్‌రెడ్డి, ఎంఎ ముతాలిబ్(జూనియర్ అసిస్టెంట్)లను శనివారం సీపీ సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి(వెల్ఫేర్), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌ఐ మామిడిపల్లి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, జూన్ 29: కొవిడ్ సమయంలో నగర పాలక సంస్థ కార్మికుల సేవలు మరువలేనివని మేయర్ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. శనివారం పదవీ విరమణ చేసిన నగర పాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్ కనకయ్య (కనకరాజ్), పిహెచ్ వర్కర్లు లచ్చన్న, రాజయ్య, మల్లయ్యలను నగర పాలక సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి మేయర్ సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాదయ్య, అదనపు కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారి ఆంజనేయులు, బిల్‌కలెక్టర్ ఖలీల్ పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

భగత్‌నగర్, జూన్ 29: కరీంనగర్ జోనల్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ మంజులరమణారెడ్డి పదవీ విరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఒకే ఆసుపత్రిలో డాక్టర్ మంజుల పూర్తి సర్వీసు 32 సంవత్సరాలు పనిచేయడం ఆమె అంకితభావానికి నిదర్శనమని అన్నారు. పదవీ విరమణ పొందినా ఆమె అనుకూలంగా ఉంటే సేవలను సద్వినియోగం చేసుకోవడానికి సంస్థ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, జోనల్‌వర్క్‌షాపు వర్క్స్ మేనేజర్ సుగుణాకర్, స్వప్నకుమారి, ఎ వెంకటేశ్వర్‌రావు, ఎంచంద్రయ్య, వి మల్లయ్య, రజనీకృష్ణ, మునీందర్, శ్రీనివాస్, రమణారెడ్డి, రియాజ్, విజయ, శ్యామల, జ్యోతి, కెబిఎస్ రాణి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రీజియన్ స్క్వాడ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న కెఆర్‌రెడ్డి శనివారం పదవీవిరమణ పొందగా కరీంనగర్ డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపరెడ్డి ఆధ్వర్యంలో అభినందన పత్రాన్ని పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో స్క్వాడ్ ఇన్‌ఛార్జి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



వైద్యుల వేషధారణలో వింధ్యావాలి విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 29: జిల్లా కేంద్రంలోని వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో శనివారం వైద్యుల దినోత్సవాన్ని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాష్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యుల యొక్క గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు వైద్యుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాలలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు స్థానిక వాసుదేవ హాస్పిటల్‌ను సందర్శించి డాక్టర్ల యొక్క విధులు, నిర్వహణ చికిత్స విధానాలను ప్రత్యక్షంగా గమనించారు. వాసుదేవ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ విద్యార్థులకు డాక్టర్ల యొక్క ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

ఘనంగా గరుడవాహన సేవ

కరీంనగర్ కల్చరల్, జూన్ 29: నగరంలోని జ్యోతినగర్, వేంకటాద్రి కాలనీ మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నిత్య పూజలు, హవనం, శ్రీవారికి మోహినీతిరుక్కోలం, అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. రాత్రి ఆలయ మాడ వీధుల్లో శ్రీవారు గరుడ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ భూదాతలు దేశబోయిన వంశ కుటుంబ సభ్యులు, ఆలయ అధ్యక్ష కార్యదర్శులు వేంకటేశ్వర్లు, వేదం, ఉపాధ్యక్షుడు గోపాలరావు, మురళి, అనంతరెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, పరంధాములు, మాజీ కార్పోరేటర్ దేశ శిల్పావేదం, ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్ పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 7-30 గంటల నుంచి నిత్య పూజలు, పద్మశాలీయుల సమాజం తరపున ఉభయ దేవేరులకు పట్టువస్త్రాలు సమర్పణ, సాయంత్రం 4 గంటల నుంచి శ్రీవారి కల్యాణ మహోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పదెకరాల వరకే రైతుభరోసా ఇవ్వాలి

చొప్పదండి, జూన్ 29: పదెకరాల వరకే రైతుభరోసా వర్తింపజేయాలని చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం తీర్మానించింది. ఈ మేరకు రైతుభరోసాపై సంఘం ఆవరణలో శనివారం డీసీవో ఆదేశాల మేరకు ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ వెల్మ మల్లారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎక్కువ మంది రైతులు పదెకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలని చెప్పగా తీర్మానాన్ని ఆమోదించి ప్రభుత్వానికి పంపించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అదికారి వంశీకృష్ణ, ప్యాక్స్ ఉపాధ్యక్షుడు ముద్దం మల్లేశం, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తాం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, జూన్29: రైతు భరోసాపై అన్నదాతలు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బత్తిని శ్రీనివాస్ అన్నారు. శనివారం కరీంనగర్ పరిపతి సహకార సంఘం రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయం కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం వలన రైతులకు లాభం జరిగిందని, అందులోని కొన్ని లోపాలపై రైతుల అభిప్రాయం తీసుకోవడానికి ప్రభుత్వం రైతులతో ప్రత్యే సమావేశం ఏర్పాటు చేసిందని అన్నారు. చాలా మంది రైతులు 10 ఎకరాల వరకు పంటలు సాగు చేసిన రైతుకు మాత్రమే రైతు భరోసా కల్పించాలని సూచించారు. గుట్టలు, చెట్లు, తోటలు, ఉద్యోగులకు రైతు భరోసా నుండి మినహాయించాలన్న రైతుల అభిప్రాయాన్ని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సూచనలు రికార్డు చేశారని, రైతులు తెలిపినట్లుగా 10ఎకరాల వరకు భరోసా కల్పించాలని తీర్మానం ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు. పంట సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా దక్కే విధంగా కృషి చేయాలనే అభిప్రాయాలు రైతుల నుంచి రావడంతో ప్రభుత్వానికి ఈనివేదికను అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల వ్యవసాయాధికారులు సత్యం, రంజీత్ సింగిల్‌విండో ఉపాధ్యక్షులు బీరం అంజనేయులు, డైరెక్టర్లు కుతాడి ఎల్లయ్య బోనాల తిరుమల్, లత, గంట శంకరయ్య సాయిల్ల మహేందర్, బోనాల నర్సయ్య లింయగయ్య, సీఈవో మేకల రమేష్, రతులు మునీ రెడ్డి, వెల్పుల రవీందర్ రావు, శ్రీనివాస్, వెంక టయ్య నవీన్, రాంరెడ్డి, సాయిల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సుభాష్‌నగర్, జూన్ 29: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రియదర్శిని కాలనీకి చెందిన పోగుల శ్రీనివాస్ మరణించగా అతని కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. నేత్ర వైద్యశాల వైద్యులచే ఆయన నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వాగ్దానాలను నెరవేరుస్తాం

కరీంనగర్ అర్బన్, జూన్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చి తీరుతుందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకాలు ప్రకటించి మోసం చేయడం కేసీఆర్‌కే సాధ్యమని అన్నారు. సమావేశంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, కుర్ర పోచయ్య, పోరండ్ల రమేష్, షబానా మహమ్మద్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం'

కరీంనగర్ టౌన్, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. శనివారం నగరంలోని అయన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన పేరుతో ప్రతినెలా ప్రజల నుంచి విజ్ఞాపనలు తీసుకుంటామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, గంగాధర చందు, మీర్ షౌకత్ అలీ పాల్గొన్నారు.

'రావూస్'లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

కరీంనగర్ టౌన్, జూన్ 29: స్థానిక రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో కరీంనగర్, రామగుండం, సిద్దిపేటలో గల బ్రాంచీలతో కలిసి జోనల్ స్థాయిలో ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రావూస్ చైర్మన్ పి.ప్రభాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఈవో నితిన్‌రావు, స్టేట్ కో ఆర్డినేటర్ శశిరేఖ, ప్రిన్సిపాల్స్ రహమాన్, తిరుపతి, సాధన, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి ఆందోళన

కరీంనగర్ క్రైం, జూన్ 29: తనను ప్రేమించి పెళ్ళి చేసుకుని ఒకబిడ్డకు జన్మనిచ్చిన తరువాత తనను మోసం చేశాడని నిరసన వ్యక్తం చేస్తూ కరీంనగర్ కట్టరాంపూర్‌లోని యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయిం చింది. బాధిత యువతి తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంటకు చెందిన యువతి, కట్టరాంపూర్‌కు చెందిన యువకుడు 2006లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కరీంనగర్‌లోనే కాపురం పెట్టామని బాధితురాలు తెలిపారు. 2023లో వారికి పాప జన్మించిందని, తనను భర్త అతని ఇంటికి తీసుకెళ్ళడం లేదని తెలిపింది. తనకు న్యాయం చేయాలని మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆందోళనకు దిగింది. ఘటనపై ఫిర్యాదు రాలేదని కరీంనగర్ ఒకటో టాణా పోలీసులు తెలిపారు.

చదరంగంతో మేథోశక్తి పెంపొందుతుంది

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 29: చదరంగం క్రీడతో మేథోశక్తి, ఏకాగ్రత పెంపొదుతాయని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. శనివారం జీనియస్ చెస్ అకాడమి, రాష్ట్ర డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్, అండర్-13 చదరంగ పోటీల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ అలుగునూరులోని లక్ష్మీనర్సింహ కన్వెన్షన్ హాలులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజేతలకు రూ.75,000నగదు బహుమతితో పాటు వంద ట్రోఫీలను అందస్తామమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పంగెం లక్ష్మణరావు, జీనియస్ చెస్ అకాడమి వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఆకాడమి డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు



పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించిన అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్29: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను శనివారం ఎంఈవో మధుసూదన్ దగ్గరుండి తొలగించారు. దుర్శేడ్, ఇరుకుల్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'దుర్శేడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో సమస్యల తిష్ట' అనే కథనానికి స్పందించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. దుర్శేడ్ జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించిన ఆయన పాఠశాలలోని సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. క్రీడా మైదానం వర్షానికి నీటిమయం కావడంతో చదును చేయిస్తామని తెలిపారు. ప్రహరీ నిర్మాణం కోసం ఈజీఎస్ నుంచి నిధులు మంజూరు అయ్యాయన్నారు. పాఠశాలకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇరుకుల్ల పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సమైక్య సాహితి పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూన్ 29: సమైక్య సాహితి ఆధ్వర్యంలో ఫిల్మ్‌భవన్‌లో శనివారం సమైక్య సాహితి విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల మూలాలను మరువరాదనే 2017 నుంచి ప్రతీ యేటా ఈ పురస్కారాలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయని అన్నారు. అతిథులుగా హాజరైన వాస్తు, జ్యోతిష పండితుడు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కవి అన్నవరం దేవేందర్, సాహితీగౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ పురస్కార ప్రదాతగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత పేరిణి ప్రకాశ్‌కు నాట్యరత్న ఆచార్య రజనీశ్రీ స్మారక నృత్య పురస్కారాన్ని, కెఎస్ అనంతాచార్యులు పురస్కార ప్రదాతగా ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు కొమాండూరి రామాచార్యులకు కలకుంట్ల సంపత్కుమారాచార్య స్మారక సంగీత పురస్కారాన్ని, డాక్టర్ డి రఘురామన్ పురస్కార ప్రదాతగా డాక్టర్ దారం నాభూషణం స్మారక పరిశోధక పురస్కారాన్ని గిరిజన మ్యూజియంల సంరక్షణాధికారి డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణకు, రావికంటి శ్రీనివాస్ పురస్కార ప్రదాతగా రావికంటి రామయ్యగుప్త స్మారక సాహితీ పురస్కారాన్ని అవధాని, పద్య కవి ముద్దు రాజయ్యకు, మాడిశెట్టి గోపాల్ పురస్కార ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య స్మారక ఉపాధ్యాయ పురస్కారాన్ని గాజుల రవీందర్‌కు అందజేశారు. ఒక్కొక్కరికీ 5116 రూపాయల నగదుతో పాటు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెఎస్ అనంతాచార్య పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా ఉండాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ - సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు సన్మానం



ఎంపీపీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం, జూన్ 29: ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాడిన వారే తిరిగి ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతారని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను పరిష్కరించడానికి గ్రామగ్రామాన పర్యటిస్తానని అన్నారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి నిధుల మంజూరు కోసం మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎంపీటీసీల గడువు ముగుస్తుండడంతో సమావేశంలో పాల్గొన్న ఎంపీపీతో పాటు ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజాజీవితంలో సంతృప్తి ఎప్పుడు ఉండదన్నారు. ప్రజాప్రతినిధులుగా గెలిచినా ఓడినా నిరుత్సాహపడకుండా ప్రజలకు సేవకులుగా ఉండి మంచి పేరును సంపాదించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారులు తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ఎస్ఐ నరేష్, ఏవో కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల మేథోశక్తి మెరుగుపరచడం ప్రశంసనీయం

తిమ్మాపూర్, జూన్ 29: మానసిక వికలాంగుల మేథోశక్తిని మెరుగుపరచడం ప్రశంసనీయమని కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి కె వెంకటేష్ అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, ఆయాలు అందిస్తున్న సేవలను తెలుసుకొని వారిని ప్రశంసించారు. బుద్ధి మాంద్యంతో చేరిన విద్యార్థుల మేథోశక్తిని మెరుగు పరుస్తూ కాల క్రమేణా వారి పనులు వారే చేసుకునేలా చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డితో పాటు సభ్యులను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగ ణంలో జడ్జి వెంకటేష్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్ట్ సభ్యులు సముద్రాల జనార్దన్‌రావు, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం

- 47అంశాలకు ఆమోదం తెలిపిన పాలకవర్గం

జమ్మికుంట, జూన్ 29: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ సమక్షంలో ఎజెండాలోని 47 అంశాలను చదివి వినిపించగా, కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఒక్కో వార్డుకు ఐదు లక్షల చొప్పున 30వార్డులకు కోటి యాభై లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆబాది జమ్మికుంట రోడ్డులోని వైకుంఠధామానికి రూ.50లక్షలు, వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఫాగింగ్ సామగ్రి కోసం కూడా నిధులు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, మేనేజర్ భూపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు 'గంగాడి'



మొక్కను నాటుతున్న గంగాడి క్రిష్ణారెడ్డి

తిమ్మాపూర్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట రూరల్/ఇల్లందకుంట/మానకొండూర్, జూన్ 29: గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి కోరారు. బీజేపీ సిద్ధాంత కర్త శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా జూలై 6 వరకు పలు కార్యక్రమలను నిర్వహించాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండలంలోని మన్నెంపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి, జమ్మికుంట పట్టణంలో, ఇల్లందకుంట మండలంలో, మానకొండూర్‌లోని మహంకాళి కాలనీలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గృహజ్యోతిని కోల్పోయిన లబ్ధిదారుడు

- 30 రోజులకు బదులు 35 రోజులకు బిల్లు



కరెంటు బిల్లు రసీదు

గంగాధర, జూన్ 29: అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారుడు గృహజ్యోతి పథకాన్ని కోల్పోతున్నాడు. గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన కడపల నర్సయ్యకు గృహజ్యోతి పథకం వర్తిస్తుంది. గత నెల 8వ తేదీన కరెంటు బిల్లు కొట్టగా రెండు వందల యూనిట్లలోపు ఉచిత బిల్లు వచ్చింది. ఈనెల 8లోపు కొట్టాల్సిన బిల్లును 12వ తేదీన కొట్టారు. నెలకు కొట్టాల్సిన బిల్లును 35 రోజులకు కొట్టడంతో యూనిట్లు పెరిగి గృహజ్యోతి వర్తించకుండా చేశారని నర్సయ్య వాపోయారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

తిమ్మాపూర్, జూన్ 29: స్థానిక ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులైన ఎస్ నీల(ఉమేన్ మజ్దూర్), బి కుమార్ (కుక్ గ్రేడ్-1), బి కనకయ్య(వాచ్‌మెన్), ఆర్ రామచంద్రయ్య (లస్కర్)లను కరీంనగర్ ఇరిగేషన్ ఇంజనీర్ చీఫ్ బిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరై సన్మానించారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ శాఖ గెస్ట్ హౌస్‌లో ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన మహోత్సవము శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఈఎన్‌సీ శంకర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఈఈ నాగభూషణం, ఇతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, జూన్ 29: రామడుగు మండలం వెలిచాల గ్రామంలో కూతాడి కనకయ్యపై తప్పుడు దొంగతనం కేసు మోపి చిత్రహింసలకు గురి చేస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీష్‌లు డిమాండ్ చేశారు. వెలిచాల గ్రామంలో కూతాడి కనకయ్య కుటుంబాన్ని శనివారం సంఘ నాయకులు కలిసి ఘటనపై నిజనిర్ధారణ జరిపినట్లు తెలిపారు.

మాజీ పీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు నివాళి

కరీంనగర్ అర్బన్, జూన్ 29: మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

●మాజీ పీసీసీ అధ్యక్షులు డి శ్రీనివాస్ మృతి పట్ల నగర కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం డి శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన డి శ్రీనివాస్ మరణించడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు అబ్దుల్ రహమాన్, కుర్ర పోచయ్య షబానా మహమ్మద్, షేక్ షహెన్‌షా, పెద్దిగారి తిరుపతి, గంగుల దిలీప్, జ్యోతి రెడ్డి, హసీనా పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు

భగత్‌నగర్, జూన్ 29: డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ హంగర్ రిలీఫ్అయన్స్ ఇంటర్నేషనల్ 320 జి లయన్ చింతకిషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గురికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. రేకుర్తికంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్ట్ మెంబర్ కొల అన్నారెడ్డిల సహకారంతో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో బట్టు రాజేందర్ పటేల్, టెక్నీషియన్ చింతల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

గణేశ్‌నగర్, జూన్ 29: ప్రస్తుత ప్రపంచంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలని వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాస్ కోరారు. వారి జీవితంలో సఫలం కావాలని ఆకాంక్షించారు. శనివారం వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో జూనియర్ విద్యార్థులచే సీనియర్ పీజీ విద్యార్థులకు వీడ్కోలు పలికేందుకు ఏర్పాటు చేసిన పార్టీలోవిద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదభరితమైన ఆటలు ఆకట్టుకోన్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాస్, ఫిజికల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ డీన్ సిహెచ్.మోహన్ ప్రసాద్, భాషల విభాగం అధిపతి డాక్టర్ ఎండీ అలీఖాన్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.గోపీకృష్ణ, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి ఎ.రవి, ఫిజిక్స్ విభాగాధిపతి బి. రమేష్, రామేశ్వరరావు, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ

-పట్టుకున్న సెక్యూరిటీ

కరీంనగర్ క్రైం, జూన్ 29: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా మైనర్ బాలుడిని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన మైనర్ బాలుడు నిజామాబాద్ పాయింట్ వద్ద పి.వినయ్‌కుమార్ అనే ప్రయాణి కుడి సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా అక్కడే విధుల్లో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ ఏఎస్ఐ ఎం.లక్పతి, కానిస్టేబుల్ బీవీ రమణ, జి కవితలు పట్టుకున్నారు. అనంతరం సెల్‌ఫోన్ చోరీ చేసిన బాలు డిని ఒకటో టాణా పోలీసులకు అప్పగించారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న కందకట్ల రమేష్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివా రం జరగగా ప్రిన్సిపాల్ ఇందిరాదేవి ఆధ్వర్యంలో అధ్యా పకులు రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు.

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల ను విడుదల చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

● శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామపంచాయతీలో శనివారం పెద్ద చెరువు మట్టి ఇటుకల తయారీ కోసం తరలింపునకు ప్రజల అనుమ తి కోసం అధికారులు శనివారం గ్రామసభ నిర్వహిం చారు. సభలో పాల్గొన్న కొంత మంది చెరువులో మట్టి తీయ వద్దని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

- శంకరపట్నం మండలంలోని కన్నాపూర్‌లో చెరువు మత్తడి నుంచి ప్రవహించే నీటిని దాటడానికి వేసిన పైపులను శనివారం ఓ వ్యక్తి ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించారు. కన్నాపూర్ గ్రామంలోని కిష్కిందపల్లెకు ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నా రు. వెంటనే సంబంధిత అధికారులు పైపులు వేసి దారి పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

● తిమ్మాపూర్: ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి ఆరోపించారు. మండల కేంద్రంలో మండల ముఖ్య కార్యక ర్తల సమావేశం నిర్వహించారు.

● గంగాధర: మండలంలోని కొండన్నపల్లి పంచాయతీ పరిధిలోని న్యాలకొండన్నపల్లి ప్రధానోపాధ్యాయు డు సత్యనారాయణ ఉద్యోగ విరమణ సన్మాన సభను పాఠశాలలో నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్ ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో రాము, రామడుగు ఎస్సై సరేందర్ పాల్గొన్నారు.

● చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమం లో ఎంపీపి చిలుక రవీందర్, జడ్పీటీసి మాచర్ల సౌజన్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసే కుట్ర జరుగుతుందని బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ అన్నారు. శనివారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. 24లక్షల మంది వైద్య విద్యార్థుల భవిష్యత్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మాజీ మార్కె ట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మాజీ పీసీసీ చైర్మన్ ధర్మపురి శ్రీనివాస్ భౌతిక ఖాయాన్ని శనివారం సందర్శించి నివాళులు అర్పించారు.

● హుజూరాబాద్‌రూరల్: సాగు చేసే ప్రతి భూమికి ప్రభుత్వం రైతుభరోసా పథకం వర్తింపజేయాలని తుమ్మనపల్లి సింగిల్‌విండో చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి అన్నారు. తుమ్మనపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో రైతు భరోసాపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సునీల్‌కుమా ర్, వైస్ చైర్మన్ వజ్జపల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు.

●కరీంనగర్ అర్బన్: పదోన్నతి కోసం 10 ఏళ్ల పాటు ఎదురు చూసి విసిగిపోయిన ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.